సర్కారీ బడులకు మహర్దశ

- పీఎంశ్రీతో డిజిటల్ సొబగులు
- మండలానికో పాఠశాల ఎంపిక
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి

పెద్దాపురం: సర్కారు బడి మరింత సుందరంగా మారనుంది. భావి పౌరులను తీర్చిదిద్దేందుకు సకల వసతులతో ముస్తాబు కానుంది. ఇప్పటికే నాడు–నేడు ద్వారా శోభాయమానంగా తయారైన పాఠశాలలను ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అమలులోకి తీసుకువచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి, ఆధునిక వసతులతో, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాయి. దీనిలో భాగంగానే ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్ (పీఎంశ్రీ) అనే పేరుతో ఓ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు, మౌలిక వసతుల కల్పన ఈ పథకం ముఖ్యోద్దేశం. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చాలి. నియోజకవర్గ పరిధిలో తొలి దశలో పెద్దాపురం మండలం నుంచి కాండ్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల, సామర్లకోట నుంచి ఉండూరు పాఠశాల ఎంపికయ్యాయి.



పీఎంశ్రీకి ఎంపికైన కాండ్రకోట జెడ్పీ పాఠశాల

హెచ్‌ఎంల నుంచే ప్రతిపాదనలు

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలో ఎలాంటి అదనపు తరగతులు కావాలనే అంశంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నివేదికలు సమర్పించాలి. త్వరలో వారు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్షాభియాన్‌కు పంపుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేస్తాయి.


పీఎంశ్రీకి ఎంపికైన ఉండూరు పాఠశాల

పాఠశాలలకు మరిన్ని సౌకర్యాలు



పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు త్వరలో డిజిటలైజ్ తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు, బోధనా సామాగ్రి సమకూరనున్నాయి. పిల్లలు విద్యలో మరింత రాణించేందుకు అవకాశం లభిస్తుంది.

– వాడ్రేవు వీరబాబు, విద్యాకమిటీ చైర్మన్, కాండ్రకోట జెడ్పీ పాఠశాల

నాణ్యమైన విద్యకు దోహదం



పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో ఈ పథకం ఎంతగానో దోహదపడుతుంది. ప్రైవేట్ స్కూళ్లతో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలు తయారవుతాయి.

– శివరామకృష్ణ ఎంఈఓ1, సామర్లకోట

తీరంలో ఘనంగా వినాయక నిమజ్జనాలు


సాగర తీరంలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం గణపతి నిమజ్జనాలతో కళకళలాడింది. సుమారు 100కు పైగా విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సాగర తీరంలో నిమజ్జనాల సందడి నెలకొంది. మండలంలోని ఉప్పాడ, కొండెవరం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై వినాయకుని ప్రతిరూపాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కొత్తపల్లి ఎస్‌ఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

క్లుప్తంగా

బండారుపై కఠిన చర్యలు తీసుకోవాలి

పెద్దాపురం: మంత్రి రోజాపై తప్పుడు ఆరోపణలు చేసిన పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీరాజేశ్వరి, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ చైర్మన్‌లు బొడ్డు తులసీ మంగతాయారు, గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఎంపీపీ పెంకే సత్యవతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎటువంటి ఆధారాలు లేకుండా ఆమెపై తప్పుడు ఆరోపణలు చేసిన బండారుపై సెక్షన్ 504, 509 కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏలేటి అనంతలక్ష్మి, రెడ్నం సునీత, కుంచే అమరావతి, మాదిరెడ్డి లక్ష్మి, పడాల సుధారాణి, బత్తిన రమణమ్మ తదితరులున్నారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు


సామర్లకోట రైల్వే క్వార్టర్స్ వద్ద ఊరేగింపులో పాల్గొన్న రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు

సామర్లకోట: నవరాత్రులు పూజలందుకున్న వినాయకులు నిమజ్జనాలకు తరలివెళ్తున్నారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ఊరేగింపుగా స్థానిక పంచారామ క్షేత్ర ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవు వద్ద గోదావరి కాలువలో నిమజ్జనాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు గోదావరి కాలువలో స్నానాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్టాండ్ ఫర్ ది సొసైటీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా స్థానికంగా ఉన్న వీరభద్ర థియేటర్‌లో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 50 మంది రక్తదానం చేశారు. అనంతరం ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందే తప్ప క్షీణించదన్నారు. స్టాండ్ ఫర్ ది సొసైటీ సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మొగలి దత్తు తదితరులు పాల్గొన్నారు.

4న తపాలా ఉద్యోగుల సమ్మె

పెద్దాపురం: గ్రామీణ తపాల ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు 4వ తేదీన నిర్వహించే ఒకరోజు సమ్మెను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు, కాండ్రకోట బీపీఎం అడ్డగర్ల సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు ఎనిమిది గంటల పనిదినాలు కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమ్మె విజయవంతానికి కాకినాడ డివిజన్ పరిధిలోని ఉద్యోగులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

నేడు మాంసం, చేపల విక్రయాల నిషేధం

సామర్లకోట: మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం మున్సిపాలిటీ పరిధిలో మాంసం, చేపల విక్రయాలను నిషేధిస్తున్నట్లు కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా హోటల్ యజమానులు మాసం, చేపల ఆహార పదార్థాలను విక్రయించరాదని సూచించారు. నిషేధాజ్ఞలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి శివారు పెదకలవలదొడ్డి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి అప్పారావు తన ఇంటి వద్ద బాణసంచాను అక్రమంగా నిల్వ చేశారని సమాచారం రావడంతో ఎస్‌ఐ స్వామినాయుడు తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. నిల్వ ఉంచిన 100 తారాజువ్వలు, 30 నాటు బాంబులను స్వాధీనం చేసుకుని అప్పారావుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

8న మెగా వైద్య శిబిరం

గోకవరం: గ్రామంలో ఈ నెల 8న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో శ్రీశాంతి ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశుభ్రతతో ప్రజారోగ్య పరిరక్షణ


పార్కు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

పెద్దాపురం: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి ప్రాంతం పరిశుభ్రతతో ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన స్వచ్ఛతే సేవ దోహదపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం ఉంటుందన్నారు. ప్రజలందరూ ఇందుకు సహకరించాలని కోరారు. తొలుత పార్కు వద్ద స్వచ్ఛతా ప్రతిజ్ఞను చేయించి పట్టణ పార్కును, రహదారులను శుభ్రం చేశారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, తాటికొండ వెంకటలక్ష్మి, పెంటకోట సత్తిబాబు, ఆరెళ్ళి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పరిధిలో..

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఆదివారం అన్ని శాఖల ఉద్యోగులు స్వచ్ఛ సేవల్లో పాల్గొన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణ, పార్కింగ్ ప్రదేశాలు, రైల్వే క్వార్టరు, వివిధ శాఖల అధికారుల కార్యాలయాలు, రైల్వే ఆస్పత్రి ప్రదేశాలను స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. రైల్వే ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు. ప్రజలు సైతం స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రవికాంత్, జోగారావు, నారాయణ, లోవరాజు, బసవేశ్వరరావు, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కిషోర్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు సంతోష్‌కుమార్, గూడ్స్ సూపర్‌వైజర్ మూర్తి, ఎస్‌ఎస్‌లు అనంతలక్ష్మి, శ్రీధర్, ఆర్పీఎఫ్ ఎస్సై రామకృష్ణ, రైల్వే డాక్టర్ నాగేంద్ర, జీఆర్పీ ఎస్సై లోవరాజు, రైల్వే ప్రయాణికుల సలహామండలి సభ్యుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో..

పెద్దాపురం: స్థానిక జవహార్ నవోదయ విద్యాలయ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహించారు. విద్యాలయ ఆవరణంలో తుప్పలు తొలగించి శుభ్రం చేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి పట్టణ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీధి నాటకాన్ని ప్రదర్శించి స్వచ్ఛతే సేవ లక్ష్యంపై అవగాహన కల్పించారు.

బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో..

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. శ్రమజీవన సౌందర్యాన్ని తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవిందు, పీఏఎస్ లక్ష్మి, కె.శివప్రసాద్, భవాని తదితరులు పాల్గొన్నారు.


రైల్వే ఆస్పత్రి ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే అధికారులు, కార్మికులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పిఠాపురం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు ఏక్ తారీక్–ఏక్ గంట కార్యక్రమం కోటగుమ్మం సెంటర్‌లో నిర్వహించారు. రహదారులు శుభ్రం చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న సమాజాన్ని స్థాపించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడదామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతా హి సేవ

పిఠాపురం: స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎ.వాసంతి ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రం చేసి, చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. వృద్ధుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్జిలు మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం రైల్వేస్టేషన్ వద్ద బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు తోట ఏడుకొండలు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పసుపులేటి సత్యనారాయణ, అల్లుబోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


నవోదయలో చీపుర్లు, బక్కెట్లు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శ్రమదానం చేస్తున్న ఉపాధ్యాయులు


పిఠాపురం రైల్వేస్టేషన్ వద్ద స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న స్థానికులు

స్వచ్ఛ సంకల్పం అందరి లక్ష్యం

- జిల్లా పంచాయతీ అధికారి విక్టర్
- పీబీ దేవంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసిన అధికారులు

సామర్లకోట: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సంకల్పం లక్ష్యంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ అన్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు మాట్లాడుతూ స్వచ్ఛ పవిత్ర యజ్ఞంలో యువకులు, విద్యావంతులు పాల్గొని గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని, సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాల బాబు, ఉప సర్పంచ్ మలకల సత్య, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి..

పంచాయతీ అనుమతి లేకుండా భవన నిర్మాణం చేయడంతో పాటు పంచాయతీకి పన్నులు చెల్లించని త్రివర్ణ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు డీపీఓకు ఫిర్యాదు చేశారు. పాఠశాల నిర్మాణంలో లోపాలున్నట్టు అధికారుల విచారణలో గుర్తించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పాఠశాలకు రెన్యూవల్ చేయవద్దని పంచాయతీ నుంచి తీర్మానం చేసి ఎంఈఓకు వివరించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల తీరుపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని సూరిబాబు డీపీఓను కోరారు.


పీబీ దేవంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ విక్టర్ తదితరులు

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం పెద్దాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని తాళ్లూరు శివారు సామిల్లుకు సమీపంలో పాన్ షాపు, జగ్గంపేట పద్మనాభ నగర్‌లో బెల్ట్ షాపు, బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలోని షాప్ షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌చార్జ్ సీఐ కేవీ స్వామి తన సిబ్బందితో దాడి చేశారు. తాళ్లూరులో 8 బీరు బాటిళ్లు, 5 మద్యం సీసాలు, జగ్గంపేట పద్మనాభ నగర్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్వామి హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై వై.నాగేంద్ర కృష్ణ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సిబ్బంది

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రత్తిపాడు: వృద్ధుల యోగ క్షేమాలను చూడాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉందని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ అడ్వకేట్ బుగత శివ అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీశారదా వయోవృద్ధ నిలయం ఆవరణలో ఆదివారం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పిల్లలపై తగు చర్యలు తీసుకోవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బొంగుళూరు మధుబాబు, ఏకేఎస్ మల్లేశ్వరరావు, ఎన్ దేవి, బెహరా లక్ష్మీప్రసన్న, వయోవృద్ధ నిలయం చైర్మన్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యం.. నేడు ప్రజలకు శాపం

- ప్రమాదాలను నివారించాలని డిమాండ్
- కూడలిని పరిశీలించిన కలెక్టర్, ఎంపీ

సామర్లకోట: గత టీడీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నిమ్మకాయల చిన్నరాజప్ప కారణంగా గొంచాల–అచ్చంపేట 216 జాతీయ రహదారి కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కలెక్టరు కృతికా శుక్లా అచ్చంపేట వచ్చిన సందర్భంగా అయా గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రహదారిపై సంభవిస్తున్న ప్రమాదాలను వివరించారు. రహదారి నిర్మాణ సమయంలో రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు అండర్ పాస్ నిర్మించాలని రాజప్పను కోరామని అచ్చంపేట సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు, పెద్దబాబు, మండల పరిషత్ వైస్ ఎంపీపీ పేర్పిడి రాయుడు తదితరులు తెలిపారు. దానిని ఆయన పట్టించుకోకపోవడం వల్ల రహదారి ప్రారంభం కాకుండానే నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రజల అభ్యర్థన మేరకు కలెక్టరు, ఎంపీ వంగా గీతతో కలసి ఆ కూడలిలో జాతీయ రహదారిని పరిశీలించారు. ప్రస్తుతం అండర్ పాస్ నిర్మాణం సాధ్యం కాదని, అయితే జాతీయ రహదారికి ఇరువైపులా గొంచాల, అచ్చంపేటల రహదారులను ఎత్తు చేయడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని గుర్తించారు. ఈ మేరకు ఎంపీ నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. గొంచాల సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, ఉప సర్పంచ్ శివశంకరప్రసాద్, పేర్నిడి జోగారావు, కర్రి బుజ్జి పాల్గొన్నారు.


గొంచాల–అచ్చంపేట కూడలిలో జాతీయ రహదారిని పరిశీలిస్తున్న కలెక్టరు కృతికా శుక్లా, ఎంపీ గీత

రూ.390 నోట్ల దండ రూ.30,100కు వేలం

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా స్థానిక సత్యనారాయణపురంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి రూ.390 నోట్లతో దండ తయారు చేసి వేశారు. స్వామి వారి విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి రూ.390 నోట్ల దండకు నిర్వాహకులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ మేరకు ఆ నోట్ల దండను రూ.30,100కు దేగల బాలాజీ దక్కించుకున్నారు. ఈ మేరకు ఆ దండను ఆ వార్డు కౌన్సిలర్ ఎస్.సురేష్ బాలాజీ భార్య దుర్గకు అందజేశారు.


నోట్ల దండను దేగల దుర్గకు అందజేసిన నిర్వాహకులు

వృద్ధులకు సత్కారం

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను సత్కరించారు. వాకతిప్ప గ్రామానికి చెందిన జ్యోతుల నారాయణస్వామిని రెవెన్యూ సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నరావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలే ఆధార్ కేంద్రాలు


ఉప్పాడ సచివాలయం-1లో ఆధార్ నమోదు కేంద్రం


- చిరునామా మార్పులు, చేర్పులకు అవకాశం
- వేలిముద్రలు, ఫోన్ నెంబర్ల అనుసంధానం

కొత్తపల్లి: పాన్ కార్డు కావాలన్నా, రేషన్ సరకులు తీసుకోవాలన్నా, బ్యాంకు ఖాతా తెరవాలన్నా, వంట గ్యాస్ రాయితీ జమ కావాలన్నా, సిమ్ కార్డు పొందాలన్నా, ఇతర ఏ ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందాలన్నా ఆధార్ కార్డు ఎంతో కీలకం. బ్యాంకు ఖాతాకు చరవాణికి ఆధార్ అనుసంధానం ఉండాల్సిందే. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ తప్పనిసరి. 2010–16 మధ్యకాలంలో చోటుచేసుకున్న బోగస్ ఆధార్ కార్డులను ఏరివేసే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన ప్రతిఒక్కరూ తమ కార్డులోని వివరాలను అప్‌డేట్ చేయించుకోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అలా నవీకరించుకోని ఆధార్ కార్డులను ఈ ఏడాది డిసెంబర్ 14 తరువాత నిలిపివేస్తామని ప్రకటించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం సచివాలయాల్లో ఆధార్ సేవలు అందిస్తుంది. మండలంలోని ఉప్పాడ–1, మూలపేట, ఎండపల్లిలో రెగ్యులర్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటికి తోడు ప్రతినెలా ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను ఏర్పాటుచేసి చిరునామా మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

అన్నింటికీ ఆధారమే

ప్రతిఒక్కరూ కార్డు పొందిన సమయంలో ఎల్రక్టానిక్ బయోమెట్రిక్ పరికరాలపై నమోదైన వేలు ముద్రలు ఆధార్‌తో అనుసంధానమై ఉంటాయి. బయోమెట్రిక్‌పై బొటన వేలు పెట్టగానే వివరాలు కనిపిస్తాయి. అయితే ఆధార్ పొంది పదేళ్లు దాటిన వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వీరంతా నవీకరించుకోవాల్సిందే. ఆధార్ కార్డు పొందిన ఐదేళ్ల నుంచి ఏడేళ్ల చిన్నారుల వివరాలను తప్పనిసరిగా మళ్లీ అప్‌డేట్ చేయించాలి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన కాకినాడ జిల్లా పేరు మీద కొత్త చిరునామా, కొత్త ఆధార్ కార్డు జారీ చేస్తారు. ఆధార్ కార్డు సస్పెండ్ అయితే ఆధార్‌తో అనుసంధానమైన అన్ని సేవలు నిలిచిపోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందే లబ్ధి సైతం నిలిచిపోతుంది. ఆధార్‌కార్డులో చిరునామా, ప్రస్తుత చిరునామా వేరువేరుగా ఉంటే సరైన ఆధారాలతో సరిచేయించుకోవాలి.

అన్ని సచివాలయాల్లో సేవలు



గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రతినెలా ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు దగ్గరలోనే సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. పిల్లలకు ఐదేళ్లు దాటాక ఓసారి, 15 ఏళ్ళు పైబడిన తరువాత మరోసారి ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయించాలి.

– పి.వెంకట నారాయణ, ఎంపీడీఓ, కొత్తపల్లి